సాక్షి ఖమ్మం

శుక్రవారం। 16 । ఆగస్టు । 2024

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

ఈ జిల్లా.. కాంగ్రెస్ అడ్డా !

- వరుసగా మూడు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కో సీటే
- ఇక్కడి కాంగ్రెస్ శ్రేణుల కృషి, శ్రమను మరువం
- సీతారామతో 7లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తీరుతాం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి చొరవతోనే ఈ ప్రాజెక్టుకు కదలిక
- మున్నేరు నుంచి 32 టీఎంసీలు కాల్వల ద్వారా పంటలకు..

వైరా రైతు సభలో సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్, కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి, తదితరులు



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఉమ్మడి ఖమ్మం.. కాంగ్రెస్ అడ్డా.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కో సీటే ఇచ్చి బొంద పెట్టారు. 2023లో ఒక్క సీటే ఇచ్చినా ఆ ఎమ్మెల్యే కూడా ఇందిరమ్మ రాజ్యంలో ఉండాలని మా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. జిల్లా కాంగ్రెస్ శ్రేణుల కృషి, శ్రమను ఎప్పటికీ ప్పుడూ మరువం. సీతారామ ప్రాజెక్టు పనులను 2026 ఆగస్టు 15లోపు పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చి తీరుతాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వైరా శాంతినగర్ సమీపాన గురువారం ఏర్పాటు చేసిన రైతుసదస్సులో సీఎం ప్రసంగించారు. రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నట్లు వేదికపై ప్రకటించగా.. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

లోక్‌సభ ఎన్నికలప్పుడు వచ్చా..

లోక్‌సభ ఎన్నికల వేళ ఇక్కడకు వచ్చినప్పుడు మీకు ఒక మాట చెప్పా. ఎన్నికల్లో ఖమ్మం నుంచి రఘురాంరెడ్డిని, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్‌ను గెలిపిస్తే భద్రాద్రి రామచంద్రుడి సాక్షిగా పంద్రాగస్టులోపు తెలంగాణ రైతాంగానికి రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించాం. అందులో భాగంగా వరంగల్ డిక్లరేషన్ ప్రకారమే రుణమాఫీ చేశాం.

రైతులతో కర్కశంగా వ్యవహరించిన బీఆర్ఎస్

జిల్లా రైతులు మిర్చికి గిట్టుబాటు ధర, దళారుల దోపిడీపై తిరుగుబాటు చేశారు. అప్పుడు దళారులను శిక్షించాల్సిన కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మంలో రైతులకు బేడీలు వేసి బజారులో నడిపించి జైలుకు పంపింది. ఆరోజు రైతాంగానికి అండగా నిలబడటానికి ఖమ్మం ర్యటనకు వచ్చా. చంటి బిడ్డతో భర్తను చూసేందుకు వచ్చిన ఆడబిడ్డపైనా పోలీసులు దాడి చేశారు. ఆనాడు ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చాను.. అంతేకాక ఎన్నికల సందర్భంలో పాదయాత్ర చేస్తూ వైరాకు వచ్చా.. ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తున్నాం.

మీ మంత్రుల ప్రతిపాదనలతోనే..

పోయినసారి జిల్లాకు వచ్చినప్పుడు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ప్రతిపాదనతో ఈరోజు సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు పొంగింది. కృష్ణా నది జలాలు కష్టమైనప్పుడు సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు ఎత్తిపోయడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇవ్వాళ గోదావరి జలాలను ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. కానీ ఇది సరిపోదు. సీతారామసాగర్‌కు రూ.18 వేల కోట్ల అంచనాలు పెంచారు. ఇప్పటికే రూ.8 వేల కోట్లు ఖర్చయింది. ఇంకా రూ.8వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తే కానీ పూర్తి కాదు. అయినా 2026 ఆగస్టు 15లోపు ప్రాజెక్టును పూర్తి చేసి ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం.

మున్నేరు ద్వారా 32 టీఎంసీలు

మున్నేరు నది నుంచి గ్రావిటీ ద్వారా నీరు తెచ్చి మీ ప్రాంతాన్ని తడపాలి. దాదాపు 32 టీఎంసీల నీరు ఇవ్వొచ్చని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. దీనిపై సాంకేతిక నిపుణులు, అధికారులతో మాట్లాడి నీరు తెప్పించే బాధ్యత మేం తీసుకుంటాం. పొంగులేటిది ఖమ్మం జిల్లా అయినా ఆయన వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి. సీతారామ ప్రాజెక్టు మీద కెనాళ్లు కట్టినా రిజర్వాయర్లు కట్టలేదని, కురవి వీరభద్రుడి సాక్షిగా డోర్నకల్ ప్రాంతానికి 15 టీఎంసీల రిజర్వాయర్ కడితే ఆ ప్రాంతానికి కూడా నీళ్లు వస్తాయని పొంగులేటి చెప్పారు. తప్పకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన ప్రణాళిక రచిస్తాం. ఖమ్మం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అయ్యో పాపం అని సానుభూతి చూపారంటే కాలనాగుకు పాలు పోసినట్టే అవుతుంది అని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

స్వాతంత్య్ర దినోత్సవం ఉట్టిపడేలా..

స్వాతంత్య్ర దినోత్సవం ఉట్టిపడేలా సభా వేదికను తీర్చిదిద్దారు. మూడు రంగుల వస్త్రం, పూలతో అలంకరించారు. ఒకేరోజు సీతారామ ప్రాజెక్టు నీరు వదలడం, రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడంతో ఫ్లెక్సీపై 'సాగుకు జీవం.. రైతుకు ఊతం' అనే నినాదం రాయించారు. సీఎం సహా మంత్రులు, నేతలంతా ఆకుపచ్చ కండువాలు ధరించారు. స్వాతంత్య్ర దినోత్సవంతో పాటు రుణమాఫీ శుభాకాంక్షలు చెప్పారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధ్యక్షత వహించిన ఈ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కనకయ్య, వెంకట్రావు, రామచంద్రునాయక్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, వివిధ సంస్థల చైర్మన్లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మేయర్ పి.నీరజ, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, తుమ్మల యుగంధర్, సాధు రమేష్‌రెడ్డి, లోకేష్‌యాదవ్, తుళ్లూరి బ్రహ్మయ్య, సంభాని చంద్రశేఖర్, బాలసాని లక్ష్మీనారాయణ, మద్ది శ్రీనివాసరెడ్డి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తులతో వచ్చిన గిరిజన మహిళలు



వైరా బహిరంగ సభకు హాజరైన రైతులు, కాంగ్రెస్ శ్రేణులు

అర గంట పాటు సీఎం ప్రసంగం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ములకలపల్లి మండలం పూసుగూడెం నుంచి సాయంత్రం 3.45 గంటలకు వైరాలోని సభావేదిక వద్దకు చేరుకున్నారు. మంత్రుల ప్రసంగాల తర్వాత 4.45 గంటల నుంచి 5.15 గంటల వరకు అరగంట పాటు ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, సీతారామ ప్రాజెక్టు, రాష్ట్రంలోని పాలమూరు, రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను ప్రస్తావించారు. ప్రత్యేకంగా ఖమ్మం జిల్లాలో ఆయన పర్యటన సందర్భంగా చూసిన దృశ్యాలను గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లాను నిర్లక్ష్యం చేసిందని మండిపడగా.. సీఎం మాట్లాడుతున్నంత సేపు సభికులు జై కాంగ్రెస్.. రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించారు.

మనం దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ పథకాలతో అర్హులందరికీ లబ్ధి
- 3.38లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ
- త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



జెండా వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ మ్రినాల్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని.. ఇందులో ఖమ్మం జిల్లా అగ్రగామిగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆతర్వాత డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరిస్తుండడంతో అర్హులందరికీ లబ్ధి జరుగుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48గంటల నుంచే హామీల అమలుకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.58కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోగా రూ.6737.39లక్షల మేర లబ్ధి జరిగిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచగా 15,307మంది పేదలు చికిత్స పొందారని తెలిపారు. అలాగే, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 2,32,587మందికి, గృహజ్యోతి పథకం 2,36,160కుటుంబాలకు అందుతోందని భట్టి వెల్లడిచారు.

త్వరలోనే ఇందిరమ్మ గృహాలు

ఇందిరమ్మ గృహాల పథకం కింద ప్రతీ నియోజకవర్గంలో 3,500 గృహాలను నిర్మించనున్నట్లు భట్టి వెల్లడించారు. కాగా, రుణమాఫీ ద్వారా జిల్లాలో రెండు విడతలుగా 91,799మంది రైతులకు రూ.520కోట్లకు మాఫీ జరగగా, మూడో విడతలో 3.38లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఇక మెడికల్ కాలేజీకి భూమి కేటాయించగా సత్తుపల్లి, పాలేరులో నర్సింగ్ కళాశాలల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల సముదాయాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా మధిరలో నిర్మిస్తామని తెలిపారు. ఇటీవల విద్యాశాఖలో అర్హులైన ఉపాధ్యాయులకే పదోన్నతి కల్పించడమే కాక అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా 955 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు.

సాగునీటి రంగంలో ముందంజ

సీతారామ ప్రాజెక్ట్ పథకం కింద పాలేరు లింక్ కాల్వ ద్వారా 47,381ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందని భట్టి తెలిపారు. ఏన్కూరు వద్ద రూ.77.05కోట్లతో చేపట్టే రాజీవ్‌లింక్ కెనాల్ ద్వారా 7,115ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడమే కాక 1,11,818ఎకరాల సాగర్ ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారు. అంతేకాక రూ.1,6692.06లక్షలతో సాగునీటి రంగంలో అభివృద్ధి పనులు చేపట్టగా, ఆర్ అండ్ బీ ద్వారా రూ.404.54కోట్ల విలువైన 120 పనులు చేశామని తెలిపారు. మున్నేరు నదిపై రూ.180కోట్లతో తీగల వంతెన, రూ.3కోట్లతో నేలకొండపల్లిలో భక్తరామదాసు ధ్యానమందిరం పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఇక రైతు బీమా ద్వారా 2023లో 830 క్లెయిమ్‌లు పరిష్కరించామన్నారు. భట్టి తన ప్రసంగం అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను సత్కరించారు. ఈకార్యక్రమంలో డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని

న్యూస్‌రీల్

మూలవరులకు పవిత్రాల ధారణ



జమలాపురంలో పవిత్రాల ధారణ చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యాగశాలలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు గర్భగుడిలో మూలవరులు, ఉత్సవ మూర్తులకే కాక ఉపాలయాల్లోని మూలవరులకు పవిత్రాల ధారణ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ తదితరులుపాల్గొన్నారు.

జేఎల్‌ఎంలకు పదోన్నతి

- జిల్లాలో 200 మందికి పైగా అవకాశం

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్ల పదోన్నతి ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి, ఎంఆర్‌టీ విద్యుత్ డివిజన్లలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతి కల్పించేందుకు డివిజనల్ ఇంజనీర్ చైర్మన్‌గా ఉన్న డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశమైంది. 2019 వరకు జేఎల్ ఎంలుగా నియమితులైన వారికి ఉద్యోగోన్నతి కల్పించనుండగా జిల్లాలో 200 నుంచి 220 మందికి అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం రూరల్ డివిజన్‌లో 70 మంది, ఖమ్మం టౌన్, వైరా, సత్తుపల్లి డివిజన్లలో 40 నుంచి 50 మంది వరకు, ఎంఆర్టీ డివిజన్‌లో 20 మంది వరకు పదోన్నతులు లభించే అవకాశముందని సమాచారం. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు కమిటీ కసరత్తు చేస్తుండడంతో సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల సందడి నెలకొంది. పదోన్నతుల జాబితా శుక్రవారం విడుదల వుతుందని ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు.

మూడో విడతలో 23వేల మంది..

- రూ.250.18కోట్ల మేర రైతు రుణమాఫీ
- నేడు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం



వైరా సభావేదిక వద్ద నవధాన్యాలు, రైతుల చిత్రాలతో వేసిన రంగవల్లులు

ఖమ్మంవ్యవసాయం: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ మూడో విడతను గురువారం ప్రకటించింది. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు వైరాలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈసందర్భంగా జిల్లాలో 23,828 మంది రైతులకు రూ.250,18,78,453 మేర రుణాలు మాఫీ కానున్నాయి. ఈ నగదు వాణిజ్య బ్యాంకుల్లోనైతే నేరుగా రైతుల ఖాతాల్లో.. పీఏసీఎస్‌ల్లో రుణాలు తీసుకున్న వారికి డీసీసీబీలో జమ చేసి అక్కడి నుంచి రైతులకు బదలాయిస్తారు. అయితే, ఈ నగదు శుక్రవారం జమ అయ్యే అవకాశముంది. మూడు విడతల్లో ఇప్పటి వరకు జిల్లాలో 1,15,627 మంది రైతులకు రుణమాఫీ వర్తించగా ప్రభుత్వం రూ.770,95,10,798 విడుదల చేసింది. మొదటి విడతలో 59,172 మందికి రూ.264.22 కోట్లు, రెండో విడతలో 33,942 మంది రైతుల ఖాతాల్లో రూ.262.50 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

పొంతన లేని లెక్కలు...

మూడు విడతల్లో రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించగా.. లెక్కల్లో పొంతన కనిపించడం లేదు. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు జిల్లాలో 3,73,157మంది రైతులకు సంబంధించి రూ.4,307 కోట్ల మేర రుణ బకాయి ఉన్నట్లు లీడ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో మూడు విడతలుగా 1.15 లక్షల మంది రైతులకు రూ.770.95 కోట్లు మాత్రమే మాఫీ అయింది. కనీసం మూడో వంతు రైతులకు కూడా రుణాలు మాఫీ వర్తించలేదని తెలుస్తోంది. రేషన్ కార్డు కలిగిన వారికే ఫలితం దక్కిందని బ్యాంకర్లు, అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యాన పెద్దసంఖ్యలో రైతులు ఆందోళన చెందుతుండగా, వారి సందేహాల నివృత్తికి ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్ కొనసాగుతోందని.. అర్హులు సంప్రదించొచ్చని అధికారులు వెల్లడించారు.

సీసీ కెమెరాలు.. మహిళా గార్డులు

- మెడికల్ కాలేజీలో మహిళా విద్యార్థులకు భద్రత
- అధికారుల నిరంతర పర్యవేక్షణ..
- మెడికోల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్న వైనం




హాస్టల్ భవనానికి ఏర్పాటుచేసిన సీసీ కెమెరా

ఖమ్మంవైద్యవిభాగం: కోల్‌కతాలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. బాధ్యులను కఠినంగా శిక్షించాలని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థినుల భద్రతపై వారిలో సందేహాలు నెలకొన్నాయి. కానీ అధికారులు మాత్రం ఆందోళన అవసరం లేదని, ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా పర్యవేక్షిస్తున్నామని చెబుతున్నారు.

గత ఏడాది ప్రారంభం

ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ గత ఏడాది ప్రారంభం 100 మందికి ప్రవేశాలు కల్పించగా ఇందులో 70మంది విద్యార్థినులే ఉన్నారు. వీరికి గత ఏడాది అక్టోబర్ నుండి తరగతులు మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటి సంవత్సరం పరీక్షలు ముగియగా ప్రాక్టికల్స్ అనంతరం రెండో ఏడాది తరగతులు మొదలు కానున్నాయి. అంతలోనే కొత్త బ్యాచ్ వచ్చే అవకాశముంది. కాగా, విద్యార్థినులకు పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ఆధునికీకరించి వసతి కల్పించారు. హాస్టల్‌లో 50 మంది ఉంటుండగా.. మిగతా వారు బయట నుండి వచ్చివెళ్తున్నారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల విషయంలో ప్రిన్సిపాల్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. భద్రత, రక్షణ విషయంలో తీసుకుంటున్న చర్యలతో ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదని చెబుతున్నారు. హాస్టల్ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి నిరంతరం పర్యవేక్షించడమే కాక హాస్టల్ ముందు వైపు గేట్లు మూసివేయించారు. కళాశాలలో నుండే బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయడంతో పాటు హాస్టల్ వద్ద ఉదయం ఒకరు, మధ్యాహ్నం, సాయంత్రం ఇద్దరు చొప్పున మహిళా సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఇద్దరు కేర్‌టేకర్లు సైతం విద్యార్థినుల బాగోగులు చూస్తున్నారని, వారంలో రెండు సార్లు మాత్రమే రెండు గంటల పాటు బయటకు వెళ్లేందుకు అనుమతిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా మెడికోల భద్రత విషయంలో తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా కల్పిస్తున్నారు.


ఏ సమస్యలు లేవు...



మాకు భద్రత, బోధన పరంగా ఇబ్బంది లేదు. నిరంతరంగా సెక్యూరిటీ ఉండడంతో సౌకర్యంగా చదువుకుంటున్నాం. హాస్టల్, మెస్‌లోనూ సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండడంతో ఎవరైనా ఇబ్బంది పెట్టినా అధికారులు స్పందించే అవకాశముంది.

– ఎస్.అమూల్య, మెడికో

నిరంతర పర్యవేక్షణ



మా విద్యార్థినులకు సమస్య రాకుండా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థినులు వచ్చివెళ్లే మార్గాల్లో మహిళా సెక్యూరిటీ గార్డులనే నియమించాం. కళాశాల, హాస్టల్ కలిపి 32కెమెరాలు ఉండడంతో ఏ విషయమైనా తెలిసిపోతుంది. పిల్లల భద్రతపై తల్లిదండ్రులకు ఆందోళన అవసరం లేదు.

– ఎస్.రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్

రాష్ట్ర సర్కారే ఇక్కడ ఉంది..

ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత

- భట్టి సూచనతోనే రాజీవ్ కెనాల్ నిర్మాణానికి నిధులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీతారామ పంప్‌హౌస్–2ను ప్రారంభించిన అనంతరం ములకలపల్లి మండలం పూసుగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన సమీక్షలో తక్కువ ఖర్చుతో 1.20 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించవచ్చని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పడంతో రాజీవ్ కెనాల్ నిర్మాణం, పంప్‌హౌస్‌ల ప్రారంభానికి నిధులు మంజూరు చేశానని తెలిపారు. ఇప్పుడు మరిన్ని నిధులు కావాలని ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు కోరుతుండగా మిగిలిన జిల్లాల నుంచి ఒత్తిడి వస్తుందని, అయినా ప్రాధాన్యత ఇస్తామని సీఎం వివరించారు. రాష్ట్ర కేబినెట్‌లో ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయం వంటి కీలక శాఖలకు చెందిన మంత్రులంతా ఇక్కడి వారే కావడంతో ప్రభుత్వమే ఇక్కడ ఉన్నట్లని సీఎం చమత్కరించారు. కృష్ణా జలాల వినియోగంపై గతంలో తమ ప్రభుత్వంలోని మంత్రుల మధ్యే తగువులు వచ్చాయని, ఇప్పుడు కృష్ణా ఆయకట్టుకు గోదావరి నీరు ఇవ్వడం వల్ల ఆ తరహా సమస్యలు ఉండవని అన్నారు. ఎంతో శ్రమతో ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు తక్కువ సమయంలో పనులు పూర్తి చేస్తే, బీఆర్ఎస్ నేతలు చవకబారు విమర్శలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.

సంతోషంగా ఉంది : తుమ్మల

జిల్లాలో 200 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తున్నా రెండు లీటర్ల జలాలను కూడా వాడుకునే వీలు ఉండేది కాదని, కానీ సీతారామతో నేడు గోదావరి జలాలు పొలాలకు వస్తున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గోదావరి జలాలను జిల్లాలోని పొలాలకు రప్పించాలనే తన కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఐదు నెలల కాలంలో రూ.500 కోట్లు ఖర్చు చేసి పంప్‌హౌస్‌లు, రాజీవ్ కెనాల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లతో పాటు యాతాలకుంట, జూలూరుపాడు టన్నెల్, దమ్మాయిగూడెం టన్నెల్ వంటి పనులకు నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాగా అధ్యయనం చేశారని మంత్రి తుమ్మల కితాబిచ్చారు.

ఎత్తిపోతలకు నిధులివ్వండి : పొంగులేటి

మున్నేరు నుంచి సముద్రంలో వృథాగా కలుస్తున్న 35 టీఎంసీల జలాలను ఎత్తిపోతల ద్వారా సీతారామ కెనాల్‌లో పోస్తే గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు జలాశయానికి చేరుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ ఎత్తిపోతలకు కేవలం రూ.120 కోట్లు ఖర్చవుతాయని, ఆ నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే రోళ్లపాడు వద్ద 18 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించి ఇల్లెందు, డోర్నకల్ నియోజకవర్గాలకు తాగునీరు అందించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపాలని అన్నారు.

వాళ్లకే నమ్మకం లేదు

గోదావరి జలాలు వారి నియోజకవర్గాలకు అందించాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ ధర్నాలు చేయడం తమ ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనమని సీఎం అన్నారు. ఎలాగైనా తాము నీరందిస్తామనే నమ్మకంతోనే వాళ్లు అడుగుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు అప్పటి సీఎంను ఎందుకు అడగలేదో చెప్పాలని సూచించారు.

మంత్రుల ప్రత్యేక శ్రద్ధతోనే..

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల శ్రద్ధతోనే సకాలంలో మూడు పంప్‌హౌస్‌లు, రాజీవ్ కెనాల్ పనులు పూర్తయ్యాయని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజీవ్ లింక్ కెనాల్‌తో 1.18లక్షల ఎన్నెస్పీ ఆయకట్టు స్థిరీకరణ అయిందన్నారు. 2026 ఆగస్టు 15 నాటికి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామన్నారు. తప్పుడు సమాచారంతో రాజీవ్‌సాగర్‌ను, నిర్లక్ష్యంతో ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రద్దు చేశారని గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

క్లుప్తంగా

ఇండియన్ పోలీస్ మెడల్ స్వీకరించిన ఏసీపీ రమణమూర్తి



సీఎం చేతులమీదుగా మెడల్ స్వీకరిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం/తల్లాడ: ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌ను ఆయన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో అందుకోన్నారు. 1995 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన రమణమూర్తి ఏసీబీ డీఎస్పీగా పనిచేసినప్పుడు అందించిన సేవలకుగాను మెడల్ ప్రకటించారు. ఈమేరకు ఆయనను సీపీ సునీల్‌దత్‌తో పాటు అధికారులు, సిబ్బంది అభినందించారు.

అటవీ సెక్షన్ అధికారి..



సీసీఎఫ్ నుంచి అవార్డు అందుకుంటున్న శిల్ప

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రేంజ్ గొల్లగూడెం సెక్షన్‌లో 2023–24లో 14 హెక్టార్ల అటవీభూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న ఉద్యోగులు 15,554 మొక్కలు నాటారు. అప్పటి సెక్షన్ ఆఫీసర్ డి.శిల్ప, బీట్ ఆఫీసర్ అరుణను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక కాగా హనుమకొండలో భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమానాయక్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో శిల్ప ప్రస్తుతం తాళ్లగూడెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా, అరుణ తల్లాడ రేంజ్‌లో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగులు





సీఎండీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఏఈ శ్రీనివాసులు, జేపీఏ ప్రభాకర్‌రావు

ఖమ్మం వ్యవసాయం/కామేపల్లి: విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ ఆఫీస్ నుంచి జేపీఏ సీహెచ్.ప్రభాకర్‌రావు, కొత్త లింగాల సెక్షన్ ఏఈ ఎస్.శ్రీనివాసులు, ఎంఆర్‌టీ డివిజన్ ఫోర్‌మెన్ ఎం.శ్రీనివాసరావు, ఎర్రుపాలెం జేఎల్‌ఎం వంశీకి హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అవార్డు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



రైతుల జీవితాన్ని ప్రతిబింబించేలా బస్వాపురం విద్యార్థుల ప్రదర్శన

ఖమ్మంసహకారనగర్: జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నగరంలోని కృష్ణప్రసాద్ మెమోరియల్ హైస్కూల్, కొణిజర్ల మండలం బస్వాపురంలోని ప్రభుత్వ ఏహెచ్‌ఎస్, ఖమ్మం బాలుర పాఠశాల విద్యార్థులు, దానవాయిగూడెంలోని గురుకులం, హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు వివిధ పాటలకు నృత్యాలు చేయగా ఆహుతులను అలరించాయి. అలాగే, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించేలా ఏర్పాటుచేసిన స్టాళ్లను పలువురు ఆసక్తిగా పరిశీలించారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం నిర్వహించిన పోటీల్లో అండర్–12, సీనియర్ పురుషుల, మహిళల జిల్లాస్థాయి అథ్లెటిక్ జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు 17, 18వ తేదీల్లో మెదక్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. కాగా, అండర్–12 బాలుర లో వరుణ్ శ్రీసాయి, బాలికల విభాగంలో బి.రిత్విక, సీనియర్స్ పురుషుల్లో వి.వేణు, మహిళల విభాగంలో సింధుప్రియ, సమ్రీన్, ఎం.మనీషా ఎంపికయ్యారని వెల్లడించారు.



మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర – సత్తుపల్లి

ఉత్తములకు ప్రశంసాపత్రాలు

విధినిర్వహణలో ప్రతిభ కనబర్చిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో 135 ఉద్యోగులను ఎంపిక చేయగా గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈమేరకు వీరిని సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో పాటు ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అభినందించారు. – ఖమ్మంసహకారనగర్



ఆర్.స్వర్ణలత, ఏఎంవీఐ



సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ



కె.అజయ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం



ఎం.ఏ.అలీమ్, మార్కెటింగ్ అధికారి



డాక్టర్ మాలతి, డీఎంహెచ్‌ఓ



ఎన్.అరుణ, ఏఓ, కలెక్టరేట్



కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్



కే.వీ.వీ.ఎం.మీనన్, సూపరింటెండెంట్



పీ.వీ.రామకృష్ణ, తహసీల్దార్



ఎన్.రూనీ విజయలక్ష్మి, డీఈఈ



ఎం.శైలజ, ప్రిన్సిపాల్, వైరా



ఎన్.విజయకుమారి, ప్రిన్సిపాల్, కారేపల్లి



ఆర్.వీ.వీ.జీ.చారి, ఏఎస్సై, కల్లూరు



కె.సతీష్, ఐటీపీ, సీఎస్‌బీ



వి.కిషోర్‌రెడ్డి, కానిస్టేబుల్, సీఎస్‌బీ



యు.సాంబరాజు, ఏసీపీ, సీసీఆర్



బి.రాజు, ఐటీపీ, సీసీఎస్

ఆకట్టుకున్న స్టాళ్లు

- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై ఎగ్జిబిట్లు
- ఆసక్తిగా పరిశీలించిన రైతులు
- ఇటువైపు సీఎం రాకపోవడంతో నిరాశ

వైరా: వైరాలో గురువారం నిర్వహించిన సభ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వ్యవసాయం, పట్టు పరిశ్రమ, ఉద్యాన వన, మత్స్య శాఖ, నీటి పారుదల శాఖ, విత్తనాభివృద్ధి సంస్థ, విద్యుత్‌శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, పశుగణాభివృద్ధి శాఖ, మార్కెటింగ్ గిడ్డంగుల సంస్థల ఆధ్వర్యాన 30 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, సబ్సిడీలను వివరించేలా ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఈ స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలిస్తారని భావించి వ్యవసాయశాఖ కమిషనర్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్‌కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ ఉమారెడ్డి పర్యవేక్షించారు. పశుగణాభివృద్ధి సంస్థ స్టాల్‌లో పుంగనూరు ఆవులు, ఒంగోలు జాతి ఆవులు, నెల్లూరు పొట్టేళ్లు ఆకట్టుకోగా.. ఖమ్మంకు చెందిన చావా నారాయణరావు వైరా మండలం పినపాకలో పెంచుతున్న పుంగనూరు ఆవులను ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రతీ స్టాల్‌కు ఆసక్తిగా వివరాలు తెలుసుకున్నారు. పామాయిల్ సాగు వివరాలు, దిగుబడిని తెలుసుకోవడమేకాక డ్రోన్ల ద్వారా ఎరువులు పిచికారీ, చెట్టు బెరడుతో విస్తరాకుల తయారీ యూనిట్ పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు చొరవతో ఆ శాఖ పరిధిలోని కార్యక్రమాలను వివరించేలా స్టాల్ ఏర్పాటుచేయించారు.



ఆవులకు పూజ చేస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్



డ్రోన్ పనితీరును తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సీఎంకు స్వాగతం పలకడానికి వచ్చిన బాలికలు

నిరాశ పరిచిన సీఎం

స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి స్టాళ్లను పరిశీలిస్తారని అధికారులు భావించారు. ఈమేరకు సీఎంకు స్వాగతం పలికేలా అశ్వారావుపేట నుంచి కొమ్ము కోయ కళాకారులు, మహబూబాబాద్ నుంచి వచ్చిన కళాకారులు, సంప్రదాయ వేషధారణలో బాలికలను సిద్ధం చేశారు. కానీ సీఎం నేరుగా వేదిక పైకి వెళ్లడం.. ప్రసంగించాక వెళ్లిపోవడంతో అంతా నిరాశ పడ్డారు.



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సునీల్‌దత్

సీఎం సభ చరిత్రలో నిలిచిపోతుంది..

ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరాలో నిర్వహించిన సభ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. సభలో ఆయన మాట్లాడుతూ రైతులు, గిరిజనులు, నిరుద్యోగులు అధికంగా ఉన్న ప్రాంతమైన ఇక్కడ వ్యవసాయ, ఐటీఐ కళాశాలలు, టూరిజం హబ్, ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం వేదికపై సీఎంకు ఆయన జ్ఞాపిక అందజేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, జావీద్, స్వర్ణకుమారి, మట్టా దయానంద్, లోకేష్ యాదవ్, దాసరి దానియేలు, కట్ల సంతోష్, హరినాథ్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. కాగా, వైరా మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పన, డంపింగ్ యార్డు, పార్కులు, డ్రెయినేజీల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.50 కోట్లు మంజూరు చేయాలని సీఎంకు మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ విన్నవించారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉదయం 11 గంటల నుంచే రావడం మొదలైంది. ఎమ్మెల్యే రాందాస్ ఆధ్వర్యాన ర్యాలీగా సభావేదికకు వెళ్లారు.



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

సీఎం సభ సైడ్ లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన హెలీకాప్టర్ మధ్యాహ్నం 3–36 గంటలకు సభావేదిక దిగింది.
- అప్పటికే కార్యకర్తలను దూరంగా ఆపుతున్నారని తెలియడంతో వేదికపై నుంచి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పోలీసులకు సూచనలు చేశారు. అలాగే, లంబాడీ భాషలోనే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించారు.
- – వేదికపై డిజిటల్ స్క్రీన్ బిగించి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల అందరి ఫొటోలను ఏర్పాటు చేశారు.
- వీఐపీ గ్యాలరీలో గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యం చేయడం ఆకర్షించింది.
- సీఎం రావడానికి రెండు గంటల ముందు నుండే కళాకారులు పాటలతో ఉత్సాహపరిచారు.
- జర్మన్ హ్యాంగర్లతో ఏర్పాటుచేసిన వేదికలో ఉక్కపోతగా ఉండడంతో సభికులు ఇబ్బంది పడ్డారు.
- సభలో దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి ప్రస్తావన వచ్చినప్పుడు మంచి స్పందన కనిపించింది.
- సీఎం వేదికపైకి వచ్చే సమయన మూడు రంగుల జెండా పట్టి.. సింగమోలే వచ్చాడంటూ పాట వేయడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు.
- దూరం నుంచైనా సభను వీక్షించేలా 20 చోట్ల ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని మాత్రమే పనిచేశాయి.
- సీఎం మాట్లాడుతుండగా మహిళా విభాగం అధ్యక్షురాలు సౌజన్య తిలకం దిద్దింది.
- డిప్యూటీ సీఎం భట్టి ప్రసంగం ముగియగానే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వాటర్ బాటిల్ అందించారు.
- సీఎం వేదికపైకి రాగానే పుష్పగుచ్ఛాలు నేతలు పోటీ పడినా పోలీసులు అనుమతించలేదు.
- సీఎస్ శాంతకుమారిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వేదికపైకి తీసుకొచ్చారు.
- సీఎం ప్రసంగిస్తున్న సమయానికి కూడా ప్రాంగణంలోకి కార్యకర్తలు రావడం కనిపించింది.
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఒక హెలీకాప్టర్‌లో.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మరో హెలీకాప్టర్‌లో వచ్చారు.

– వైరా/వైరారూరల్

పోలీసుల అత్యుత్సాహం

వైరా: వైరాలో సీఎం సభ సందర్భంగా కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో అటు సామాన్య ప్రజలు ఇటు ప్రజాప్రతినిధులు.. చివరికి మీడియా ప్రతినిధులు సైతం ఇబ్బంది పడ్డారు. వ్యవసాయం, అనుబంధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన స్టాళ్ల వద్ద వెళ్తున్న జర్నలిస్టులను అడ్డుకున్నారు. పాస్‌లు ఉన్నాయని చెప్పినా సీఎం వస్తున్నారంటూ బయటకు పంపించేశారు. చివరకు అక్కడకు సీఎం మాత్రం రాలేదు. ఇక సభకు వస్తున్న వారి వాహనాలను పల్లిపాడు సెంటర్‌లోనే నిలిపేసి నడిచి వెళ్లాలని చెప్పడంతో చాలా మందివెనుదిరిగారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ వేదిక పైనుంచి సూచనలు చేయడంతో వాహనాలను వదిలేశారు. వీఐపీ పాస్‌లు ఉన్న పలువురు ప్రజాప్రతినిధులను ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక కొందరు జర్నలిస్టులు రోడ్డు వెంట ఫొటోలు తీస్తుండగా ఫోన్లు లాక్కొని డిలీట్ చేయడం గమనార్హం. ఇదంతా ఒక ఎత్తయితే సభ ముగియగానే పోలీసులు చేతులెత్తేయడంతో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి.

వెంటవెంటనే విషాదం

- అమ్మమ్మ అంత్యక్రియలకు వెళ్లిన మనవడు మృతి
- స్నానం చేస్తూ బావిలో మునిగి కన్నుమూత

కామేపల్లి: అమ్మమ్మ అంత్యక్రియలకు వెళ్లిన మనవడు బావిలో స్నానం చేసే క్రమాన నీటమునిగి చనిపోయిన విషాద ఘటన ఇది. కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన లకావత్ సాలి(90) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలను సొంత వ్యవసాయ క్షేత్రంలో పూర్తిచేశారు. ఆతర్వాత సంప్రదాయం ప్రకారం కుటుంబీకులు కొందరు స్నానం చేసేందుకు అక్కడే ఉన్న వ్యవసాయ బావిలోకి దిగారు. ఇందులో మృతురాలి మనవడు, అదేగ్రామానికి చెందిన భూక్యా బావ్‌సింగ్(50) కూడా ఉండగా ఆయనకు ఈత వచ్చనుకుని ఎవరూ గమనించలేదు. కానీ ఈత రాకపోవడంతో ఆయన బావిలో మునిగి మృత్యువాత పడ్డాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు బావ్‌సింగ్‌ను బయటికి తీసేసరికే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా.. ఒకే కుటుంబంలో వరుస విషాదాలతో అంతా నీ్రరుమున్నీరయ్యారు.



బావ్‌సింగ్ (ఫైల్)

కోర్టులో జాతీయ జెండా ఆవిష్కరణ

ఖమ్మం లీగల్: ఖమ్మంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజాగోపాల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని, పరస్పరం సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఆతర్వాత క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, ఎం.అర్చనాకుమారి, డి.రాంప్రసాదరావు, కే.వీ.చంద్రశేఖర్‌రావు, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, బిక్కం రజని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, న్యాయవాదులు యుగేందర్, లలిత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ గీతం ఆలపిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్, న్యాయమూర్తులు, న్యాయవాదులు

నకిలీ కాదు.. డెయిరీ అధికారి!

కేసు వెనక్కి తీసుకున్న ఎస్‌ఓ

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో తనిఖీకి వచ్చిందని నకిలీ అధికారి కాదని.. విజయ డెయిరీ అధికారి అని తేలడంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి లత తెలిపా రు. పాఠశాలకు బుధవారం వచ్చిన ముగ్గురు వ్యక్తులు టిఫిన్ తయారీతో పాటు పాలను తనిఖీ చేసి ఫొటోలు దిగి వెళ్లారు. అయితే, వారు సిబ్బందికి స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో నకిలీ అధికారులుగా భావించి ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్‌ఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పత్రికల ద్వారా గురువారం తెలుసుకున్న ఖమ్మం విజయ డెయిరీ డీడీ మోహన మురళి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకున్నట్లు లత వెల్లడించారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ

వైరారూరల్: వైరాలో గురువారం నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు పాల్గొనడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ సునీల్‌దత్ సభా ప్రాంగణం, వీఐపీల పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం సభా ప్రాంగణం, రహదారులపై ఇబ్బంది ఎదురుకాకుండా అధికారులకు సూచనలు చేశారు. వివిధ మండలాల నుండి వాహనాల్లో రైతులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు వస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా ఆర్టీసీ బస్సులను మాత్రమే ఖమ్మం వైపు పంపించారు. సభకు వచ్చిన వాహనాలను వైరా రింగ్ రోడ్డు సెంటర్ నుండి మధిర రోడ్డులో ఉన్న కమ్మ కల్యాణ మండపం వద్ద పార్కింగ్ స్థలానికి మళ్లించారు. అలాగే, ఖమ్మం వెళ్లే కార్లు, ఇతర వాహనాలను మండలంలోని తాటిపూడి, చిన్న మునగాల మీదుగా పంపించారు.

పోడు పట్టాలు ఇవ్వాలని ఆందోళన

వైరారూరల్: వైరాలో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతుండగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు నిరసన తెలిపారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌తో ప్లకార్డులు ప్రదర్శించారు. ఇంతలోనే అప్రమత్తమైన పోలీసులు వారిని సభా ప్రాంగణం నుండి బయటకు తీసుకెళ్లారు. అలాగే, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలంట ప్లకార్డులు ప్రదర్శించారు.



ఆందోళన చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పెనుబల్లి: రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను బొగ్గు టిప్పర్ ఢీకొనడంతో టిప్పర్ క్లీనర్ మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సత్తుపల్లి నుండి బొగ్గు లోడుతో వెళ్తున్నన్న టిప్పర్ లంకపల్లి వద్ద ట్యాంకర్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో టిప్పర్‌లోని క్లీనర్, చంద్రుగొండ మండలం రాంపురానికి చెందిన రాజమల్లు(70) అందులో ఇరుక్కుపోయి మృతి చెందాడు. అలాగే, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఆదర్శ రైతు ఆత్మహత్య

అప్పుల భారం పెరగడంతో మనస్తాపం

రఘునాథపాలెం: అప్పులు పెరగడంతో ఎలా తీర్చాలా అనే మనస్తాపానికి గురైన పాపటపల్లికి చెందిన రైతు ఈ.మాధవరావు(55) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మాధవరావు తన ఎకరన్నర భూమిలో వేరుశనగ, జామతో పాటు కూరగాయలు సాగు చేస్తూ ఆదర్శ రైతుగా నిలిచాడు. పొలంలో డెయిరీ ఫారం కోసం షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షల అప్పు చేశాడు. గతంలో తీసుకున్న పంటరుణం, బ్యాంకుల్లో భూమి తనఖా పెట్టి తీసుకున్న అప్పు కలిపి రూ.10 లక్షలు ఉందని తెలిసింది. దీనికి తోడు తల్లి, భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా మనస్తాపానికి గురైన ఆయన మరో గ్రామంలో ఉన్న చిన్నకోడలికి ఫోన్ చేసి పిల్లలను చూడాలని ఉందని బుధవారం పిలిపించుకున్నాడు. పిల్లలను చూసి కాసేపు గడిపిన అనంతరం ఆయన గదిలోకి వెళ్లిన మాధవరావు గడ్డిమందు తాగాడు. కొద్దిసేపటికి గమనించి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మాధవరావుకు తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి...

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కన్నెపోగు వెంకటేశ్వర్లు(55) అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా బుధవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. ఆయనను కుటుంబీకులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య పిర్యాదుతో కేసు నమోదు చేసినట్లుఎస్సై మధుబాబు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరానికి చెందిన యువకుడు మద్యం మత్తులో పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వ్యవసాయ కూలీ భూక్యా శ్రీకాంత్(26)కు నాలుగు నెలల క్రితం కొణిజర్ల మండలం అమ్మపాలెం రాజ్యాతండాకు చెందిన పద్మతో వివాహమైంది. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన ఆయన మత్తులో బుధవారం రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉండే తన తమ్ముడికి ఫోన్ చేసి చెప్పగా బంధువులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

బాసర ఆలయంలో చోరీ

హుండీ పగులగొట్టిన దొంగలు


కెమెరాకు చిక్కిన అనుమానితుడు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం ఆవరణలో ఉన్న శ్రీదత్తాత్రేయ ఆలయంలో ఉన్న హుండీని దొంగలు పగులగొట్టారు. అంతటితో ఆగకుండా ఆలయానికి సమీపంలో ఉన్న భక్తులకు ప్రసాదం ఇచ్చే గది తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. అయితే ఈ దృశ్యాలు రికార్డవుతాయని గుర్తించిన దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆలయం లోపల, బయట సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి కళ్లుగప్పి దొంగలు లోనికి ప్రవేశించడం భద్రతా లోపాలను ఎత్తిచూపింది. చోరీ జరిగిన విషయాన్ని ఉదయం గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానితుడి ముఖం అందులో రికార్డు అయింది. దీని ఆధారంగా విచారణ జరుపుతున్నారు. అనుమానితుడు మహారాష్ట్ర వాసిగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఎంత సొత్తు అపహరణకు గురైందనే విషయాలను ఆలయ అధికారులుగానీ, పోలీసులు గానీ వెల్లడించలేదు.

విషజ్వరంతో విద్యార్థి మృతి


ఊరడి రంజిత్ (ఫైల్)

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లిలో విషజ్వరంతో ఊరడి రంజిత్ (9) అనే బాలుడు మృతి చెందాడు. రంజిత్ 4వ తరగతి చదువుతున్నాడు. రెండ్రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న బాలుడిని గురువారం మధ్యాహ్నం గాంధారి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. గ్రామంలో వారం రోజులుగా విష జ్వరాలు సోకి అనేక మంది బాధపడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోయారు. బాధ్యులైన వైద్యాధికారులను, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

3 ప్రాజెక్టులను ఆదుకున్న 'ఎల్లంపల్లి'


వరదకాల్వ ద్వారా తరలుతున్న ఎల్లంపల్లి జలాలు

ఎల్లంపల్లి టు రంగనాయకసాగర్ వయా మిడ్‌మానేరు • ఎత్తిపోతలతో తరలిన 20 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): నిన్నటిదాకా నీరు లేక వెలవెలబోయిన మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వస్తుండడంతో మూడు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు పెరిగాయి. బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి శ్రీపాద ఎల్లంపల్లి జలాలు గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతల ద్వారా చేరుతున్నాయి. మిడ్‌మానేరులో 17 టీఎంసీల మేర నీరు చేరిన తర్వాత ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు ప్యాకేజీ–10లోకి.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టు–11లోకి నీరు విడుదల చేస్తున్నారు. ఎత్తిపోతలతో ఎల్లంపల్లి జలాలు నంది పంప్‌హౌస్ నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి వరదకాల్వ మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి అన్నపూర్ణతోపాటు సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు తరలుతున్నాయి. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరడంతో గత జూలై 27వ తేదీ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరదకాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది.

మిడ్‌మానేరు టు అన్నపూర్ణ.. రంగనాయకసాగర్

మిడ్‌మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ పూర్తి నీటిమట్టం 3.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.60 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు అప్రోచ్ కెనాల్ నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఈనెల 5వ తేదీ నుంచి రోజుకు 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్యాకేజీ–11లోకి రోజుకు 3,300 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లోగా వెళుతోంది. ఇప్పటికే రెండు రెండు టీఎంసీల నీరు చేరింది. దీంతో ప్రస్తుతం రంగానాయకసాగర్ లో 2.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రంగనాయకసాగర్ నుంచి మల్లన్న సాగర్‌కు రోజుకు 3, 900 క్యూసెక్కుల నీరు మల్లన్నసాగర్ నుంచి కొండ పోచమ్మసాగర్‌లోకి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


మిడ్‌మానేరు ప్రాజెక్టు

ఆదుకున్న ఎల్లంపల్లి జలాలు

మిడ్‌మానేరులో గత జూలై 27వ తేదీకి ముందు 5.90 టీఎంసీల మేర నీటి నిల్వలు మాత్రమే ఉండేవి. ఈక్రమంలో మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వదలడంతో 20 రోజులుగా వచ్చిన నీటితో ప్రస్తుతం 15.91 టీఎంసీలకు నీటినిల్వ చేరింది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం నిత్యం 3,150 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఇప్పటి వరకు సుమారు 20 టీఎంసీల నీరు చేరింది. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న వరదకాల్వలో నీరు నిండుగా ప్రవహిస్తుండడంతో ఆయా పరిధిలోని రైతులు 2వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు



గత జూలై 27 నుంచి మిడ్‌మానేరులోకి ఎత్తిపోతల ద్వారా ఎల్లంపల్లి జలాలు తరలుతున్నాయి. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో ప్రభుత్వ ఆదేశాలతో అన్నపూర్ణ ప్రాజెక్టులోకి రోజుకు 6,400 క్యూసెక్కులు, కుడికాల్వకు 100 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నాం.

– జగన్, మిడ్‌మానేరు, ఈఈ


ఎట్ హోంలో గవర్నర్ జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్. చిత్రంలో బుర్రావెంకటేశం, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, సీఎస్ శాంతికుమారి

జోరు వానలో ఎట్ హోమ్

పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, పొన్నం, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సాయంత్రం రాజ్‌భవన్ ప్రాంగణంలో ఎట్ హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.కేశవరావు, చిన్నారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభమైన కొద్దిసేపటికే భారీ వర్షం ప్రారంభమైంది. అయితే వాటర్‌ప్రూఫ్ టెంట్లు వేసి ఉండటంతో జోరు వానలోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, పద్మ పురస్కార గ్రహీతల వద్దకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి పలకరించారు. చివర్లో గవర్నర్ అతిథుల టేబుల్స్ వద్దకు వెళ్లి అందరినీ పలకరించారు. కాగా, వర్షపు నీటి ప్రవాహం టేబుల్స్ కిందకి చేరడంతో చివర్లో కొంత అసౌకర్యం కలిగింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ నేతలు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.


టేబుళ్ల వద్ద వర్షపు నీరు



భిన్నత్వంలో ఏకత్వమే మన బలం

మాతృభూమికి స్వాతంత్య్రం కోసం పోరాడిన అసంఖ్యాక దేశభక్తుల నిస్వార్థ త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన రాజ్‌భవన్ దర్బార్ హాల్ ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన ఏడు దశాబ్దాల్లో దేశం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే మన అతిపెద్ద బలమని స్పష్టం చేశారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్‌భవన్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొడుకు కోసం.. తల్లి నిర్బంధం

▶ మొదటి పేజీ తరువాయి

'నీ కొడుకు మైనర్ పిల్లను ఎత్తుకొనిపోయాడు. వాడు ఎక్కడున్నాడో రెండు రోజుల్లో వెతికి తీసుకురావాలి. లేదంటే వాణ్ణి నేనే పట్టుకొచ్చి తుపాకీతో కాల్చి చంపేస్తా..'అంటూ బెదిరించాడు. దీనికి కళావతి స్పందిస్తూ.. 'కూలి పనులు చేసుకునే మాకు ఏం తెలుసు సారూ.. వాడు పట్నంలో పనిచేసుకునేవాడు. కాశీంపూర్ పిల్లతో ప్రేమ కుదిరింట. అది పిల్ల తల్లికి కూడా తెలుసు. వారు ఎక్కడికి పోయారో నాకు తెలీదు' అని చెప్పింది. దీంతో ఎస్‌ఐ ఒక్కసారిగా ఆవేశానికి లోనై లాఠీతో విచక్షణారహితంగా కొట్టారు. ఆ దెబ్బలకు చేతులు, కాళ్లు వాచిపోయాయని, నడవడానికి కూడా రాలేదని బాధితురాలు వాపోయింది. 'ఆ రోజు నుంచి ప్రతీ రోజు పోలీస్ స్టేషన్‌కి వస్తున్నా. రోజూ ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కి వచ్చి కూర్చోవాలి. తాగడానికి నీళ్లు కూడా ఇవ్వరు. ఆకలితో రాత్రి 9 గంటల వరకు ఉండి సారుకు చెప్పి ఇంటికెళ్తున్న. నిన్న ఒక్క రోజే (బుధవారం) స్టేషన్‌కు రాలేదు'అంటూ ఠాణాకు వెళ్లిన విలేకరులకు చెబుతూ కళావతి కన్నీటి పర్యంతమైంది. రోజు కూలి పనులు చేసుకునే తమకు మూడు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఎస్‌ఐపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కళావతికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విచారణ జరుపుతాం: అశోక్, సీఐ తాండూరు రూరల్

కిడ్నాప్ కేసు విషయం మా దృష్టిలో ఉంది. కిడ్నాపర్ మైనర్ అయినా అరెస్టు చేయాల్సిందే. విచారణలో భాగంగా బాలుడి తల్లిని బషీరాబాద్ ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఎస్‌ఐ ఆమెను కొట్టాడనే విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరుపుతాం.

2 గంటలు.. 8 సెం.మీ.లు

▶ మొదటి పేజీ తరువాయి

మాదాపూర్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్‌పేట, ఎల్బీనగర్, ఉప్పల్, నల్లకుంట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై భారీగా వరద చేరడంతో వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ జామ్ అయ్యింది. వర్షం నేపథ్యంలో అధికారులు అలర్ట్ ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప వాహనాలతో రోడ్లపైకి రావొద్దని సూచించారు. కాలినడకన వెళ్లే వారు మ్యాన్ హోల్‌లను చూసుకొని వెళ్లాలని నగర పోలీసులు సూచించారు. ఉప్పల్, నాగోల్‌తోపాటు పలు మెట్రో స్టేషన్లలో వర్షపు నీరు చేరింది.

8.7 సెం.మీ. వర్షపాతం నమోదు

నగరంలో సగటున 8.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. ముషీరాబాద్‌లో 8.7 సెం.మీ, హిమాయత్ నగర్‌లో 7, సైదాబాద్‌లో 6.8, కూకట్‌పల్లిలో 6.6. బాలానగర్‌లో 6.5, అంబర్‌పేటలో 5.9, ఎల్బీనగర్‌లో 6.1, ఉప్పల్‌లో 6 వర్షపాతం నమోదైంది.


జిల్లా వార్తలు

భద్రాద్రి జిల్లాలో ఐజీపీ పర్యటన


స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం మల్టీజోన్–1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి పర్యటించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఆయనకు ఎస్పీ రోహిత్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం పోలీసుస్టేషన్ పరిసరాలు, రికార్డులు కేసుల వివరాలపై ఐజీ ఆరా తీశారు. స్టేషన్‌కు సమస్యలతో వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, డయల్ 100కు వచ్చే ఫోన్లపై సత్వరమే స్పందించాలని ఆదేశించడమే కాక కేసుల పరిష్కారం, సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేశారు. ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ కరుణాకర్, ఎస్సై విజయ పాల్గొన్నారు.

వేదికపై 10జీపీఏ విద్యార్థులు!


వేదికపై కూర్చున్న విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ముగ్గురు విద్యార్థులకు అనుకోని అవకాశం దక్కింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్, కేఎంసీ కమిషనర్ అగస్త్య అభిషేక్‌తో కలిసి సదరు విద్యార్థినులు వేదికను పంచుకోవడంతో పలువురు ఆసక్తిగా పరిశీలించారు. విషయమేమిటా అని ఆరా తీస్తే గత విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ చదివి 10జీపీఏ సాధించి అందుబాటులో ఉన్న కొందరు విద్యార్థులను ఆహ్వానించాలని కలెక్టర్ నిర్ణయించారు. దీంతో చింతకాని మండలం కొదుమూరు నుంచి షేక్ ఆస్మా, వైరా రెసిడెన్షియల్ పాఠశాల నుంచి వసంత శాంతి, మాచినేని అశ్రితను ఆహ్వానించగా వారు వేదికపై కూర్చుని వేడుకలు తిలకించారు.

సింగరేణి మనుగడకు కృషి చేయాలి

- యంత్రాలతో రోజుకు 18 గంటలు పని చేయించాలి
- స్వాతంత్య్ర వేడుకల్లో సీఎండీ బలరామ్


ఉత్తమ సింగరేణీయులతో సీఎండీ బలరామ్, ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సంస్థ మనుగడకు ఐక్యంగా కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. పనివిధానంలో మార్పురావాలని, షిఫ్ట్‌లోని 8 గంటల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం బలరామ్ మాట్లాడుతూ దేశంలో ఏటా సుమారు 1000 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నా, థర్మల్ విద్యుత్‌కు సరిపోవటం లేదని, దీంతో ఇతర దేశాల నుంచి 180–200 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో బొగ్గు ఉత్పత్తి పెంచుకోవాలన్నారు. సింగరేణిలో గతేడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. భారీ యంత్రాలను కేవలం 13,14 గంటలు మాత్రమే వినియోగిస్తున్నామని, 18 గంటలు వినియోగించుకోవాలని సూచించారు. ఓసీల్లో ప్రైవేట్ కాంట్రాక్టర్లు, తక్కువ జీతాలతో, మామూలు యంత్రాలతో రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్లు ఓబీ తీస్తుంటే, మనం భారీ యంత్రాల ద్వారా రోజుకు లక్ష క్యూబిక్ మీటర్లు మాత్రమే తీస్తున్నామని పేర్కొన్నారు. లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 22 భూగర్భ గనుల్లో ఏ ఒక్కటీ లాభాల్లో లేదన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గితేనే భూగర్భ గనులు నడిపించ గలుగుతామన్నారు. అధికారులు, ఉద్యోగులు తీరు మార్చుకుని సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం సింగరేణి వ్యాప్తంగా ఎంపిక చేసిన 12 మంది సింగరేణియన్‌లను ఆయనతో పాటు డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని సన్మానించారు. ఆ తర్వాత సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది, కొత్తగూడెం పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ మార్చ్‌ఫాస్ట్ చేశారు. పలువురు విద్యార్థులు నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, ఎం.సత్యనారాయణరావు, గుర్తింపు సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం నాయకులు త్యాగరాజన్, అధికారులు సామ్యేల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్, తదితరులు


సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

56 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా 56మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఐదుగురు డీజీఎంలు, ఒక సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ అధికారి, 21 మంది అదనపు మేనేజర్లు, 12 మంది డిప్యూటీ మేనేజర్లు, ఏడుగురు ఎస్ఈలు, ముగ్గురు డీవైఎస్ఈలు, ఒక కాలరీ మేనేజర్, ఆరుగురు అండర్ మేనేజర్ స్థాయి అధికారులు ఉన్నారు. ఇదిలాఉండగా గతంలో నలుగురు అధికారులను బదిలీ చేయగా ఆ ఉత్తర్వులను రద్దుచేశారు. కొద్ది రోజుల క్రితం 14 మందిని బదిలీ చేయగా అందులో నలుగురి బదిలీని యాజమాన్యం రద్దు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎక్కడైనా కార్మికులను బదిలీ చేస్తే రిలీవ్ అయ్యేవరకు అధికారులు వెంటపడుతుండగా.. అధికారుల విషయంలో భిన్నంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

కిన్నెరసానిలో పంద్రాగస్టు సందడి


జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పంద్రాగస్టు సందర్భంగా మండలంలోని కిన్నెసాని రిజర్వాయర్‌కు పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కిన్నెరసానిలోకి 480మంది పర్యాటకులు ప్రవేశించడం ద్వారా వైల్డ్ లైఫ్ శాఖకు రూ.18,685, 250మంది జలాశయంలో బోటింగ్ చేయడంతో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ.13,330 ఆదాయం లభించింది. కాగా, సిబ్బంది బోట్లకు త్రివర్ణపతాకాన్ని కట్టి జలాశయంలో తిప్పారు. కాగా, కిన్నెరసానిని కొత్తగూడెం ఆర్డీఓ మధు, పాల్వంచ తహసీల్దార్ వివేక్ తదితరులు సైతం సందర్శించారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు స్థల పరిశీలన

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం పరిధిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంటర్నేషల్ స్కూల్ ఏర్పాటుకు అధికారులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మీపురం రెవెన్యూలోని 401సర్వే నంబర్‌లో 20ఎకరాలు, 220సర్వే నంబర్‌లో ఏడెకరాల భూమిని బెంగళూరుకు చెందిన ఆర్కిటెక్ బృందం మనోజ్‌లద్దా, నితిన్ పరిశీలించి భవన నిర్మాణాలకు అనువుగా ఉందా, లేదా అని ఆరా తీశారు. ఈ మేరకు పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పేషీ సూపరింటెండెంట్ రాజేష్, తహసీల్దార్ పున్నం చందర్, సర్వేయర్ కృష్ణమూర్తి, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


స్థల వివరాలు ఆరా తీస్తున్న ఆర్కిటెక్ బృందం, ఉద్యోగులు

గిరిజనుల సంక్షేమానికి కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్య్ర ఫలాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ఐటీడీఏ కృషి చేస్తోందని తెలిపారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యా, వైద్యం, ఇంజనీరింగ్, వ్యవసాయం, మౌలిక వసతులు, సాగునీరు, తాగునీరు, స్వయం ఉపాధి తదితర రంగాలలో గిరిజనుల సంక్షేమానికి ఐటీడీఏ విశేష కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆ తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు డేవిడ్‌రాజ్, మణెమ్మ, తానాజీ, దావూద్, భాస్కర్, ఉదయ్ కుమార్, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, మునీర్ పాషా, అశోక్, ఆదినారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్, ఇతర అధికారులు


భద్రాచలం ఏరియా ఆస్పత్రి నర్సింగ్ ఆఫీసర్ కె.మాలతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పీఓ

నవ్వుల్ పువ్వుల్!


నవ్వుకుంటున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల


సభావేదికపై సరదాగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి

ఖమ్మం జిల్లా వైరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి, మంత్రుల మోములో నవ్వులు విరబూశాయి. సభా వేదికపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సరదాగా నవ్వుతూ కనిపించారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం మాట్లాడుకునే క్రమంలో నవ్వులు చిందించడం కనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఢిల్లీ వేడుకల్లో గురుకులం విద్యార్థిని

నేలకొండపల్లి: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం స్వాతంత్య్ర వేడుకల్లో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెం గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి.గ్రేషిత పాల్గొంది. ఇటీవల ప్రేరణ కార్యక్రమం ద్వారా ఆమె గుజరాత్‌లోని ప్రధాని మోదీ నివాసంలో పది రోజుల పాటు శిక్షణకు హాజరైంది. అనంతరం ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర వేడుకలకు తెలంగాణలోని గురుకులాల నుంచి గ్రేషితకు మాత్రమే ఆహ్వానం అందగా వెళ్లింది. ఈ సందర్భంగా వేడుకలను తిలకించాక గ్రేషిత మాట్లాడుతూ ప్రధాని మోదీ జెండా ఎగురవేసే దృశ్యాన్ని వీక్షించడం ఆనందంగా ఉందని వెల్లడించింది.


ఎర్రకోట వద్ద గ్రేషిత